కాంగ్రెస్‌లో చేరిక

వాంకిడి ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో గురువారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ ఎంపీటీసీ తారాబాయితో పాటు గ్రామానికి చెందిన 20 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ, అనీల్, గణేష్, ప్రశాంత్, జీవన్, దీపక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు చేసుకోవాలి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం పథకం కోసం మండలంలోని అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవవో రమేష్ తెలిపారు. గురువారం రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం యువకులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ బుచ్చన్న, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుక్క దాడిలో వృద్ధురాలికి గాయాలు

దహెగాం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం ఖర్జి గ్రామంలో గురువారం కుక్క దాడిలో ఎల్కరి గంగక్క(70) అనే వృద్ధురాలికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఇటీవల ఇదే కుక్క కిష్టన్న, వంకర్, పెంటయ్యలపై దాడి చేసి గాయ పర్చినట్లు స్థానికులు తెలిపారు.

ఛత్రపతి శివాజీకి ఘన నివాళి

వాంకిడి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో గురువారం ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బిజైరాం, జైరాం, హంసరాజ్, రాజేంద్రప్రసాద్, శ్యాంరావు, విఠల్, రోషన్, విజయ్, మనోజ్, అరుణ్, కమలాబాయి, ఇంద్రబాయి, గంగుబాయి పాల్గొన్నారు.

బుద్ధగయ మహాబోధి విహార్‌ను అప్పగించాలి

వాంకిడి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): బిహార్ రాష్ట్రంలోని బుద్ధగయ మహాబోధి విహార్‌ను బౌద్ధులకు అప్పగించాలని బిక్కు సంఘ్, భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ సంఘం, రమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో గురువారం మండలంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. బౌద్ధ మహాసభ బిక్కు సంఘ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బంతే భరద్వాజ్ మాట్లాడారు. కార్యక్రమంలో అశోక్, జయరాం, విలాస్, రాజేంద్రప్రసాద్, హంసరాజ్, శ్యాంరావు, హిరశన్, పాండుజీ, రాజేశ్వరి, శ్యాంరావు, లాహుజి, రోషన్, అరుణ్ పాల్గొన్నారు.

తునికాకు సేకరణపై ఆశలు

- జిల్లాలో 6.42 లక్షల అటవీ విస్తీర్ణం
- 26,300 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం
- కూలీలకు వేసవిలో ఉపాధి
- ఇప్పటికే టెండర్లు పూర్తి



చింతలమానేపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వేసవిలో గిరిజన, గిరిజనేతర కూలీలకే కాకుండా అటవీ శాఖకు ఆదాయం సమకూర్చిపెట్టే తునికాకు సేకరణకు రంగం సిద్ధమైంది. వేసవి పంటగా భావించే తునికాకు సేకరణపై కూలీలు ఆశలు పెట్టుకున్నారు. దీనికి అనుగుణంగానే సంబంధిత అధికారులు సైతం ఇప్పటికే టెండర్లు పిలిచి తునికాకు సేకరణ కోసం అడుగులు వేస్తున్నారు. అయితే ఎండా కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో చాలా మందికి ఉపాధి హామీ పనులు తప్ప వేరే పనులేమి ఉండవు. దీంతో తునికాకు సేకరణతో ఒక్కో కుటుంబం రోజు సుమారుగా రూ. 500- 1000 వరకు సంపాదించుకునే అవకాశం ఉన్నది. జిల్లాలో సుమారుగా 10వేల మంది వరకు ఉపాధి పొందుతారు. దీనికి తోడు బోనస్ అదనంగా రానున్నది. ఏప్రిల్ చివరి వారం నుంచి మే మొదటి వారంలో తునికాకు సేకరణ ప్రారంభం కానుండగా వెయ్యి కట్టలను ఒక్క స్టాండర్డ్ బ్యాగుగా పరిగణించి లెక్కలోకి తీసుకుంటారు. స్టాండర్డ్ బ్యాగు అంటే ఒక్కో కట్టలో 50 ఆకు లుంటాయి.ఇలాంటివి వెయ్యి కట్టలు కలిపితే ఒక స్టాండర్డ్ బ్యాగ్ అవుతుంది.

15 మండలాల పరిధిలో..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 6.42 లక్షల ఎకరాల్లో అటవీ విస్తీర్ణం ఉండగా 2 డివిజన్లు ఉన్నాయి. 11 రేంజ్‌లు, 74 సెక్షన్‌లు, 15 యూనిట్లు ఉండగా 179 కళ్లాలు ఏర్పాటు చేసే అవకాశం ఉన్నది. 26,300 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యంగా పెట్టుకున్నారు. మొత్తం 15 యూనిట్లకు గానూ ఇప్పటికే టెండర్లు పిలువగా 9 యూనిట్లు గుత్తేదారులు దక్కించు కున్నారు. త్వరలోనే మళ్లీ టెండర్లు పిలిచే అవకాశం ఉన్నది. దీంతో మరి కొన్ని యూనిట్లు గుత్తేదారులు దక్కించుకునే అవకాశం ఉన్నది. అయితే ఇప్పటి వరకు 9 యూనిట్లలో 18,800 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం పెట్టారు. మరికొన్ని టెండర్లు పూర్తైతే యూని ట్ల విక్రయం ఆధారంగా మరి కొన్ని స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం పెరిగే అవకాశం ఉంటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఒక వేళ టెండర్ ప్రక్రియ లో ఎవరూ గుత్తేదారులు ముందుకు రాకపోతే ఈ తొమ్మిది యూనిట్ల పరిధిలో తునికాకు సేకరణ జరుగనున్నది. గతేడాది 12 యూనిట్ల పరిధిల 151 కళ్లాల్లో తునికాకు సేకరణ జరిపారు. మొత్తం 23,100 స్టాండర్డ్ బ్యాగుల లక్ష్యం పెట్టుకోగా 18,871 సాధిం చారు. సుమారుగా 9వేల మంది కూలీలకు 4.50 కోట్ల వరకు ఆదాయం లభించింది.



తెల్లవారుజామునుంచే..

తునికాకు కూలీలు తెల్లవారుజామునే ఆకు సేకరించేందుకు సమీప అటవీ ప్రాంతానికి వెళ్లి ఆకు సేకరించి కట్టలు కట్టి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కళ్లాల్లో ఆకుల కట్టలను విక్రయిస్తారు. దీని ద్వారా ఒక్కో కూలీ సుమారుగా రోజు రూ. 500-1000 వరకు సంపాదించే అవకాశం ఉన్నది. ఇవే కాకుండా ప్రభుత్వం కూలీలకు బోనస్ సైతం అందిస్తున్నది. సేకరించిన ఆకులను వేలం నిర్వహించి వచ్చిన ఆదాయంలో కూలీలకు తిరిగి బోనస్ రూపంలో అందిస్తారు.

గతంలో 2015 వరకు బోనస్ డబ్బులు చెల్లించారు. ఆ తర్వాత నుంచి నిలిచి పోయాయి. రెండేళ్ల కిందట అప్పటి ప్రభుత్వం 2016-21 మధ్య కాలానికి సంబంధించి ఒకేసారి జిల్లాకు రూ. 36 కోట్లు విడుదల చేశారు. అయితే ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి కావడం, గుత్తే దారులు యూనిట్లు దక్కించుకో వడంతో తునికాకు సేకరణపై కూలీలు ఆశలు పెట్టుకున్నారు.

వాంకిడి చెక్‌పోస్టుపై ఏసీబీ దాడులు



వాంకిడి చెక్‌పోస్టు

వాంకిడి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వాంకిడిలోని అంతర్రాష్ట్ర ఆర్టీఏ చెక్‌పోస్టులో బుధవారం అర్ధరాత్రి ఏసీబీ అధికారులు దాడులు చేశారు. కరీంనగర్ ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, ఆదిలాబాద్ ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో ఏసీబీ అధికారులు చెక్‌పోస్టులో అర్ధరాత్రి సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో ఏఎంవీఐ మాధవి విధులు నిర్వహిస్తున్నారు. బయట వాహనాలను నిలుపుతూ వాళ్ల దగ్గర నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తులు ఐలయ్య అలియాస్ రవి, విజయ్‌కుమార్‌లను ఏసీబీ అధికారులు విచారించారు. వారు వాహనదారుల నుంచి వసూలు చేసిన రూ. 45,100ను సీజ్ చేశారు. ప్రైవేట్ వ్యక్తుల వద్ద సీజ్ చేసిన నగదును కోర్టులో జమచేసి విధులు నిర్వహిస్తున్న ఏఎంవీఐ మాధవిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. దాడుల్లో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు కృష్ణకుమార్, పున్నం చంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పనులు త్వరగా పూర్తి చేయాలి


వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

తిర్యాణి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేపడుతున్న పనులను త్వరగా పూర్తి చేయాలని అదనపు కల్టెర్ దీపక్ తివారి అన్నారు. గురువారం ఆయన తిర్యాణి మండలంలో పర్యటించారు. రొంపల్లిలో ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొని అనంతరం తిర్యాణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని జేఈ బద్రుద్దీన్‌కు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో మల్లేష్, డాక్టర్ పల్లవీ, వైద్య సిబ్బంది వంకర్, శ్రీనివాస్, సాజిత బాను ఉన్నారు.

చేపల కుంట పనుల పరిశీలన

సిర్పూర్(టి), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాగమ్మ చెరువులో నిర్మిస్తున్న చేపల కుంట పనులను ఎంపీడీవో సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉపాధి కూలీల సంఖ్య పెంచి పనులు వేగవంతం చేయాలన్నారు. కూలీలు పనులను సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని చెప్పారు. ఆయన వెంట ఈవో తిరుపతి, ఎఫ్ఏ రాజేశ్వర్ ఉన్నారు.

కార్డుదారులందరికీ సన్న బియ్యం


వాంకిడిలో సన్న బియ్యం పంపిణీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వాంకిడి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం జిల్లాలోని వాంకిడి మండలం ఘాట్‌జనగాం గ్రామంలో ఏర్పాటు చేసిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్డుదారులు ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యంను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. గతంలో ప్రజాపాల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేయనున్నామని చెప్పారు. సన్న బియ్యం ప్రతీ కార్డుదారుడికి అందజేసేందుకు జిల్లాలో అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పంపిణీ పథకం పేదలకు ఎంతో మేలు చేస్తుందన్నారు. పేద కుటుంబంపై ఎలాంటి భారం ఉండదన్నారు. కార్డుదారులు చౌకధరల దుకాణాల వద్ద క్రమ పద్ధతిలో వచ్చి సన్న బియ్యం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహకార అధికారి బిక్కు, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. గురువారం మండలంలోని పోతెపల్లి, ఎల్కపల్లి, ఎల్లూరు గ్రామాల్లో సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ నిలుపుకుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఆల్బర్ట్, ఎస్సై కొమురయ్య, ఎంఈఓ రమేష్ బాబు, నాయకులు చంద్రమౌళి, నాయకులు రాజన్న, కృష్ణ, సబియా, బాపూజీ, చందు తదితరులు పాల్గొన్నారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): శివాజీనగర్‌లో నిత్యావసర సరకుల షాపులో ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావ్ సన్న బియ్యం పథకాన్ని ప్రారంభించారు. ఆర్డీవో మాట్లాడుతూ బియ్యం అందరికి అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జాదవ్ గుణ్వంత్‌రావ్, తహసీల్దార్ బీర్షావ్ తదితరులు పాల్గొన్నారు.



పెంచికలపేటలో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్


జైనూరులో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆర్డీవో లోకేశ్వర్‌రావ్

24న విద్యార్థులకు టాలెంట్ టెస్టు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న జిల్లా కేంద్రంలో విద్యార్థులకు టాలెంట్ టెస్టు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సంఘం జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి అన్నారు. స్థానికంగా గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పరీక్షల్లో ప్రతిభ చాటిన విద్యార్థులకు హైదరాబాద్‌లోని ప్రగతినగర్‌లో పీపుల్స్ ప్రోగ్రెసీవ్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఉచిత విద్య అందిస్తారని చెప్పారు. తల్లిదండ్రులులేని, పేద విద్యార్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు 4, 5, 6 తరగతుల్లో చేరేందుకు అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఊశన్న, ఇందురావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి


సమావేశంలో పాల్గొన్న ఉపాధి హామీ కూలీలు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ జాబ్ కార్డులను రాజంపేట గ్రామ పంచాయతీలో విలీనం చేసి పనులు కల్పించాలని ఆసిఫాబాద్ మున్సిపాలిటీ ఉపాధి హామీ కూలీల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో ఆసిఫాబాద్ మున్సిపల్ పరిధిలోని ఆసిఫాబాద్, గొడవెల్లి, జన్కాపూర్, తారకరామానగర్ కాలనీలకు చెందిన ఉపాధి హామి కూలీలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పద్మ, పావనిలు మాట్లాడుతూ ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఏర్పడడంతో తమకు ఉపాధి హామి పనులు కల్పించడం లేదన్నారు. దీంతో తాము తీవ్రంగా నష్ట పోతున్నామన్నారు. మున్సిపాలిటీ పరిదిలో గల కూలీలకు రాజంపేట గ్రామ పంచాయతీలో జాబ్ కార్డులు విలీనం చేసి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కూలీల సంఘం నాయకులు స్వరూప, మంజుల, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

సాలెగూడలో కాంగ్రెస్ నాయకుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలెగూడ గ్రామంలో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ఆదేశాల మేరకు గురువారం కాంగ్రెస్ నాయకులు ర్యాలీ నిర్వహించారు. జై బాపు, జై భీం, జై సంవిధన్ కార్యక్రమంలో భాగంగా మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు చరణ్, మల్లేష్, శివరాం, దీపక్, శివప్రసాద్, మనోహర్, బండు, కిరణ్, రాము తదితరులు పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): కెరమెరి మండలంలోని కోటారి, రింగన్‌ఘాట్, గోయగాం, ధనోర, పార్డ, సుర్దాపూర్, ఝరి, మోడి గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జై బాపు, జై భీం, జై సంవిధాన్ యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం చేస్తున్న దుష్పరిణామాలు, రాజ్యాంగం మార్చే కుట్రలు, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను ప్రజలకు వివ రించారు. కాంగ్రెస్ పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల మాటలు నమ్మకూడదన్నారు. కార్యక్రమంలో మునీర్ అహ్మద్, కుసుం రావ్, లక్ష్మణ్, లింబరావు, నానేశ్, నగేష్, రాజు, శంకర్, హన్మంతు, బుచ్చయ్య, సీను, ముకుందరావు, విశ్వనాథ్, రవి, పాలక్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా వైకుంఠధామం

- ఐదేళ్లుగా పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

తిర్యాణి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వైకుంఠధామం పనులు అసంపూర్తిగానే ఉన్నాయి. దీంతో చివరి మజిలికి ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. ఐదేళ్ల క్రితం అన్ని గ్రామ పంచాయతీల్లో వైకుంఠధామాలు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఒక్కొక్క వైకుంఠధామం నిర్మాణానికి రూ.12 లక్షల నిదులు మంజూరు చేసింది. బట్టలు మార్చుకునేందుకు ప్రత్యేక గదులతో పాటు మంచినీటి సౌకర్యం, మృతదేహాలను దహన సంస్కారాలు చేసేందుకు అనువుగా ప్రత్యేక నిర్మాణాలు చేపట్టారు. దీంతో గ్రామాల్లో కొంత వరకు కష్టాలు తప్పాయి. మండలంలోని అన్ని పంచాయతీల్లో వైకుంఠధామాలు పూర్తయి వినియోగిస్తున్నారు. కానీ మండల కేంద్రంలోని వైకుంఠధామం మాత్రం పూర్తి చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు.రూ.12 లక్షలతో వైకుంఠధామం నిర్మాణ పనులను కాంట్రాక్టర్ ప్రారంభించారు. 70 శాతంకు పైగా పనులు సైతం పూర్తి చేశారు. అందుకు సంబంధించి అప్పటి ఇంజనీరింగ్ అధికారులు ఎంబీ రికార్డు చేసి రూ.3.30 లక్షల నిదులను కాంట్రాక్టర్ ఖాతాల్లో వేశారు. పనులు పూర్తైన తరువాత మిగితా పనులకు సంబంధించి ఎంబీ రికార్డు నమోదు చేసి నగదును కాంట్రాక్టర్ ఖాతల్లో జమ చేశారు. కానీ సదరు కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయడంపై ఆసక్తి చూపక పోవడంతో వైకుంఠధామం అలంకార ప్రాయంగా మారింది. అధికారులు త్వరగా పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


పూర్తి చేయని వైకుంఠధామం

మహిళల ఆర్థికాభివృద్ధికి చర్యలు

● వెంకటరమణశర్మ, ఏపీవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

ఏపీవో: మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలని ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తున్నాం. ప్రభుత్వ పథకాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నాం. ఆసక్తి ఉన్న వారికి ఆర్థిక తోడ్పాటును అందించి ప్రోత్సహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో ఎన్ని సంఘాలు ఉన్నాయి?

ఏపీవో: మండలంలో 702 మహిళ సంఘాలు నడుస్తున్నాయి. ఈ ఏడాది 300 సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా రూ.23.80 కోట్ల రూపాయల రుణం ఇప్పించాం.

ఆంధ్రజ్యోతి : మహిళా శక్తి పథకం ద్వారా ఎలాంటి ప్రోత్సాహకం అందిస్తున్నారు..?

ఏపీవో: మహిళా శక్తి పథకం ద్వారా రుణాలతో పాటు స్వయం ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాం. ముఖ్యంగా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు కోసం నాలుగు కోట్లు రుణాలిప్పించాం. చేపల పెంపకానికి కుంటలు తవ్వుకోవడానికి సహకరిస్తున్నాం. 19 గ్రామాల నుంచి 72 మంది కుట్టు మిషన్ శిక్షకులను గుర్తించాం. వారితో మహిళలకు శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- రెబ్బెన, ఆంధ్రజ్యోతి

బైండోవర్ ఉల్లంఘించిన ఇద్దరికి జరిమానా



బైండోవర్ ఉల్లంఘన నోటీసును అందజేస్తున్న ఎక్సైజ్ సీఐ రవికుమార్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేశీదారు విక్రయించకుండా బైండోవర్ చేసినప్పటికీ నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరికి గురువారం జరిమానా విధించారు. ఎక్సైజ్ సీఐ రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్ మండలం ఈసుగాం గ్రామానికి చెందిన సాయిరి రమేశ్, పట్టణానికి చెందిన రాజు దేశీదారు విక్రయిస్తూ పట్టుబడడంతో గత ఏడాది తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇటీవల మళ్లీ దేశీదారు విక్రయించడంతో పట్టుకొని మళ్లీ తహసీల్దార్ ఎదుట హాజరు పరిచారు. బైండోవర్ ఉల్లంఘిం చినందుకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున కాగజ్‌నగర్ తహసీల్దార్ కిరణ్‌కుమార్ జరిమాన విధించారు.



గుంతలమయంగా మారిన పెంచికలపేట రోడ్డు



పనులు నిలిచిన సలుగుపల్లి-పెంచికలపేట రోడ్డు

తీరని కష్టం..

అనుమతుల్లో జాప్యం

- నిలిచిన రోడ్ల నిర్మాణాలు
- నిధులు మంజూరైనా నిరుపయోగం
- అన్నింటికీ అటవీశాఖ అభ్యంతరమే కారణం

బెజ్జూరు, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అటవీ గ్రామాల్లో బీటీ రోడ్ల నిర్మాణాలు నిలిచిపో యాయి. కేంద్ర అటవీశాఖ అనుమతులు కావాలని అధికారులు అభ్యంతరం చెబుతున్నారు. దీంతో జిల్లా పరిధిలో ఏజెన్సీ ఏరియాలో రోడ్ల పనులు ముందుకు సాగడంలేదు. గ్రామాల మధ్య అనుసంధానం కలగాలంటే ప్రధానంగా రోడ్ల కనెక్టివిటీ పెరగాలి. అయితే ఎప్పుడో వేసిన రోడ్డు ప్రస్తుతం పూర్తిగా దెబ్బతినడంతో రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ప్రయాణికులు తీవ్రఅవస్థలు పడుతున్నారు. సలుగుపల్లి-పెంచికలపేట మధ్య కేవలం 15కిలోమీ టర్ల దూరమే అయినా ఆ రోడ్డుపై సుమారు 300వరకు గుంతలు ఉన్నాయి. దీంతో ఈ రోడ్డుపై ప్రయాణం చేయడం నరకప్రాయంగా మారుతోందని వాహనదారులు వాపోతున్నారు. ముఖ్యంగా బెజ్జూరు నుంచి వివిధ అవసరాల నిమిత్తం కాగజ్‌నగర్‌కు వెళ్లాలంటే ఈ రోడ్డుమార్గాన్ని అనుసరిస్తారు.

తెలంగాణ ఏర్పాటు అనంతరం తొలి ఏడాదిలో సలుగుపల్లి -పెంచికలపేట మధ్య బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు నిర్మాణం చేపట్టి దాదాపు పదేళ్లు కావస్తోంది. 15కిలోమీటర్ల రోడ్డుపై పూర్తిగా గుంతలు పడడంతో రాకపోకలకు ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డుపై వాహనాలు ప్రయాణించేటప్పుడు గంటకుపైగా సమ యం పడుతోందని ప్రయాణికులు చెబుతున్నారు.

● **మూడేళ్ల క్రితం..**

మూడేళ్ల క్రితం సలుగుపల్లి-పెంచికలపేట మధ్య రోడ్డు నిర్మాణం కోసం అప్పటి ప్రభుత్వం మావోయిస్టు ప్రాబల్య నిధుల కింద రూ.10కోట్లు మంజూరు చేసింది. అటవీ అనుమతులు లేవనే కారణంగా రోడ్డు పనులు చేపట్టలేదు. దీంతో నిధులు మంజూరైనా పనులు చేపట్టలేకపోవడంతో ప్రజలకు గుంతలు పడ్డ రోడ్లపై రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. గుంతలపడ్డ రోడ్లపై రాకపోకలు సాగిస్తుండడంతో వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయని వాపోతున్నారు. నిత్యం ఈ రోడ్డుపై ప్రయాణికులు ఇటు కాగజ్‌నగర్‌కు అటు దహెగాం, మంచిర్యాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు రెండు జిల్లాలకు అనుసంధానం చేస్తుంది. ఈ ప్రాంతంలో ఎవరైనా వ్యాధుల బారిన పడితే మంచిర్యాలకు ఆసుపత్రులకు వెళ్లేందుకు ఈ మార్గం దగ్గరగా ఉంటుంది. దీంతో ప్రతినిత్యం ఈ రోడ్డు మార్గాన రద్దీ కూడా అధికంగా ఉంటుంది. కానీ అటవీ అనుమ తులు లేక రోడ్డు పనులు ప్రారంభం కాలేదు.

గతంలో రోడ్డు నిర్మాణానికి మంజూరైన రూ.10కోట్లు పనులు ప్రారంభించక పోవడంతో మూడు నెలల క్రితం వెనక్కి మళ్లాయి. వర్షాకాలం అనంతరం ప్రజలు పడుతున్న కష్టాలను చూసి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఈ రోడ్డుపై శ్రమదానంతో మొరంపోసి గుంతలను పూడ్చారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి సలుగుపల్లి-పెంచికలపేట మధ్య రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వసూళ్లపై పెద్దయ్య భక్తుల ఆగ్రహం

దండేపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలంలో అటవీ ప్రాంతంలో పెద్దయ్య దేవుడి దర్శనం కోసం వచ్చే భక్తుల నుంచి అటవీ శాఖ అధికారులు ఎంట్రీ ఫీజు, ఇటు పంచాయతీ అధికారులు వాహనాల కోసం పార్కింగ్ ఫీజ్ వసూళ్ల చేయడంపై పెద్దయ్య భక్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దర్శనం కోసం ఇతర ప్రాంతాల నుంచి భక్తులు వాహ నాలలో వస్తుంటే ఈ వసూళ్ల ఏంటని భక్తులు అధికారులపై మండిపడ్డారు. దీంతో గంటపాటు అటవీ ప్రాంతంలో భక్తులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. విషయం తెలుసు కున్న ఎంపీడీవో ప్రసాద్ అక్కడికి చేరుకున్నారు. దర్శనం కోసం వచ్చే భక్తుల వాహనాల పా ర్కింగ్ కోసం ఇటీవలే టెండర్ నిర్వహించారు. పార్కింగ్ ఫీజ్ పంచాయతీ వారికే చెల్లించాల్సి ఉంటుందని భక్తులకు సూచించారు. ఫారెస్టు అధికారులు తమకే ఫీజ్ చెల్లించాలని చెప్పడంతో కొంత సేపు గందరగోళానికి దారి తీసింది. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకవెళ్లతామని భక్తులకు చెప్పి అప్పటి వరకు ఎవరికి వాహనం ఎంట్రి ఫీజ్, పార్కింగ్ ఫీజ్ చెల్లించవద్దని ఎంపీ డీవో చెప్పారు. అటవీ శాఖ అధికారులు మాత్రం దర్శనం కోసం వచ్చే భక్తుల నుంచి తాము ఎంట్రి ఫీజ్ వసూళ్ల చేస్తామని చెప్పడంతో అక్కడ గొడవకు దారి తీసింది.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

తిర్యాణి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలంలో నాణ్యమైన విద్యుత్ కోసం సమ్మర్ యాక్షన్ ప్లాన్ కొనసాగిస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రవీందర్ అన్నారు. గురువారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందులో భాగంగా చింతపల్లిలో విద్యుత్ నియంత్రికను ఏర్పాటు చేశామని చెప్పారు. ఎండకాలాన్ని దృష్టిలో ఉంచుకొని అవసరమయ్యే విద్యుత్ ప్రజలకు అందాలనే ఉద్దేశ్యంతో తమ సిబ్బందితో కలిసి సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట సబ్ ఇంజనీర్ సౌమ్య, కాంట్రాక్టర్ సత్యనారాయణ, లైన్‌మెన్ నిరంజన్, కృష్ణ, రతీష్, రాజు, బాదిరావు తదితరులు పాల్గొన్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

దహెగాం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసానాలకు దూరంగా ఉండాలని ఎస్సై రాజు అన్నారు. బుధవారం రాత్రి దహెగాం మండలం హత్తిని గ్రామంలో పోలీసులు మీ కోసం భాగంగా కళాజాత ప్రదర్శణ నిర్వహించారు. ఈ సందర్భంగా బెట్టింగ్ యాప్‌లతో నష్ట పోతారని, లోన్ యాప్‌లలో రుణాలు తీసుకోవద్దన్నారు. యువత చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దన్నారు. బాల్య వివాహాలు చేయకూడదని చెప్పారు. దీని వల్ల ఆడపిల్లలకు అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాజాబృందం సభ్యులు, పోలీసులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య పోరాటం స్ఫూర్తిదాయకం



దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే , నాయకులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్య మంలో వీరోచితంగా పోరాటం చేసిన దొడ్డి కొమురయ్య పోరాటం భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో గురువారం జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలకు జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్, యాదవ కుల సంఘం నాయకులు, వెనకబడిన తరగతుల కులాల సంఘ నాయకులతో కలిసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంగా మారడానికి దొడ్డి కొమురయ్య అమరత్వం ప్రధాన కారణమని అన్నారు. నిజాం పాలనలో ఇబ్బందులను సహించలేక ప్రజలను చైతన్యవంతం చేసి ఉద్యమాన్ని నడిపించారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి సజీవన్, నాయకులు మల్లికార్జున్, సురేష్, వెంకన్న, రమేష్, శంకర్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలో గురువారం బీజేపీ ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాలకృష్ణ, తిరుపతి, ఎర్రయ్య, రాజారాం, రాకేష్, గంగ, శ్రీనివాస్, కిషన్, గోపాల్, మహేష్, శ్రావణ్‌గౌడ్, వెంకటి, తులసీరాం, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మహంకాళి జాతరకు ఏర్పాట్లు ప్రారంభం

రెబ్బెన, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం ఇందిరానగర్‌లో కొలువు దీరిన కనకదుర్గాదేవి ఆలయంలో ఈ నెల 12, 13 నిర్వహించే మహంకాళి అమ్మవారి జాతర మహోత్సవాలకు గురువారం అభివృద్ధి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు దేవర వినోద్, ఆలయ అధ్యక్షుడు మోడెం తిరుపతిగౌడ్, కమిటీ సభ్యులు సంతోష్, కమ్మరి మల్లేష్ ఆధ్వర్యంలో భక్తుల కోసం వివిధ సౌకర్యాలు కల్పించేందుకు అన్నీ చర్యలు తీసుకుంటున్నారు. అలాగే దర్శనానికి బారికేడ్స్ ఏర్పాటు చేస్తున్నారు.

రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటాం

సిర్పూర్(టి), ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించుకుంటామని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని డోర్‌పల్లి గ్రామంలో నిర్వహించిన జై బాపు, జై భీం, జై సంవిధాన్ పాదయాత్రలో ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ అనీల్‌జాదవ్, ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌తో కలిసి పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టు

వాంకిడి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హెచ్‌యూసీ భూములను కాపాడాలని కోరుతూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన చలో హెచ్‌యూసీ కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో కేవీపీఎస్ నాయకులు దినకర్, డీవైఎఫ్ఐ నాయకులు కార్తీక్, నిఖిల్, తిరుపతి ఉన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం తలపెట్టిన చలో హెచ్‌సీయూ కార్యక్రమంలో భాగంగా ముందస్తుగా మండలంలోని ఏబీవీపీ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. తమను ఇలా అరెస్టు చేయడం సరికాదని పలువురు ఖండించారు. అరెస్టు అయిన వారిలో బాలకృష్ణ, వెంకటేష్, సాయి ఉన్నారు.

కళాకారులకు న్యాయం చేయాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగ కళాకారులకు న్యాయం చేయాలని పలువురు కోరారు. గురువారం జిల్లా కేంద్రంలో పలువురు మాట్లాడారు. ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు మెదక్ ఎమ్మెల్సీ వేరి సుభాష్‌రెడ్డి అసెంబ్లీలో నిరుద్యోగ కళాకారుల పక్షాన తమ గళాన్ని వినిపించినందుకు వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా నిరుద్యోగ కళకారులకు ఉద్యోగాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కళాకారులు సంధ్య, సంతోష్, కార్తీక్, సమ్మక్క, రణదీప్, ఆర్యన్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గిస్తాయి



మాట్లాడుతున్న జీఎం విజయభాస్కర్‌రెడ్డి

రెబ్బెన, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఒత్తిడిని తగ్గించి క్రీడాకారులను దృడంగా ఉండేలా దోహదపడుతాయని బెల్లంపల్లి మేనేజర్ ఎం విజయభాస్కర్ రెడ్డి అన్నారు. గురువారం రెబ్బెన మండలం గోలేటిలోని శ్రీ భీమన్న మైదానంలో 36వ శ్రీ వేణుగోపాల్ మెమోరియల్ ఇన్విటేషనల్ వాలీబాల్ టోర్నమెంటు వేడుకల్లో ఒలింపక్ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి క్రీడలపై మక్కువతో గోలేటికి రావటం అభినందనీయమన్నారు. మూడు రోజుల పాటు పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు వసతితో పాటు భోజన సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. విజేతకు రూ.30 వేల నగదు, రన్నర్ జట్టుకు రూ.20వేల నగదు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, డీజీఎం ఐఈడీ ఉజ్వల్ కుమార్ బెహర, సీఎంఓఎఐ కార్యదర్శి వీరన్న, డీజీఎం సివిల్ మదినా భాషా, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్‌పాల్గొన్నారు.



టోకెన్ సమ్మెకు కార్మికులు సిద్ధం కావాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వచ్చే నెల 20వ తేదీన నిర్వహించే టోకెన్ సమ్మెకు కార్మికులు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు వి. సీతారామయ్య అన్నారు. శ్రీరాంపూర్‌లోని ఆర్కే-7 గనిపై బుధవారం నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్నారు. 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్లుగా మార్చ డం, ఏప్రిల్ నుంచి అమలు చేయడం, బొగ్గు బ్లాకులను వేలం వేయడం సరికాదన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా అన్ని కార్మిక సంఘాలు మే 20న సమ్మెకు పిలుపునిచ్చా యన్నారు. సింగరేణిలో సైతం ఒక్క రోజు సమ్మె చేసి కార్మికులు తమ నిరసన తెలుపాలన్నారు. అంతేకాకుండా సింగరేణి యాజమాన్యం నూతన గనులు ప్రారంభించి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఉపాధ్యక్షుడు కొట్టి కిషన్‌రావు, బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రాంచందర్, చంద్రశేఖర్, అఫ్రోజ్‌ఖాన్, మారపల్లి సారయ్య, అడ్డు శ్రీనివాస్, సురేష్‌పాల్గొన్నారు.

సింగరేణి బ్లాకుల వేలాన్ని అడ్డుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణి బ్లాకుల వేలాన్ని అడ్డుకోవాలని అఖిల భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఏఐఎఫ్‌టీయూ), రైతు కూలీ సంఘం(ఆర్‌సీఎస్), స్త్రీ విముక్తి(పీఓడబ్ల్యూ) నాయకులు అన్నారు. శ్రీరాంపూర్-నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సింగరేణి బ్లాకులను వేలం వేస్తూ సంస్థకు నష్టం చేసున్నదని చెప్పారు దీన్ని ఐక్య కార్మిక సంఘాలు అడ్డుకున్నాయని తెలిపారు. కానీ సింగరేణిలోని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు వేలానికి అనుకూలంగా ఉపముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వడం సమంజసం కాదన్నారు. కార్పొరేట్ శక్తుల నుంచి పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో అందాల పోటీలకు అనుమతి ఇచ్చిందన్నారు. అంతేకాకుండా 200 కోట్ల రూపాయలు విడుదల చేయడం సరికాదన్నారు. రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్‌ను అనుసరించి అడవులలోని ఆదివాసీలకు స్వయం పాలనా అధికారం ఇవ్వాలన్నారు. నక్సలైట్ల వేట పేరుతో అడవులను ధ్వసం చేయడం నిలిపివేయాలని, సైనికులను వెనక్కి పంపాలని, బేస్‌క్యాంపులు ఎత్తివేయాలని, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ భూములను అలాగే ఉంచాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలపై చర్చించేందుకు శనివారం మంచిర్యాలలోని చార్వాక ట్రస్ట్ భవన్ హాలులో ఉదయం 10 గంటలకు నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి అంజయ్య, రాష్ట్ర కార్యదర్శి మేకల పోషమల్లు, వర్కింగ్ ప్రెసిడెంట్ టి. రత్నకుమార్, కోశాధికారి రాములు, రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదానందం, నాయకులు లావణ్య, రాజ్‌కుమార్, దుర్గయ్య, యాకయ్య, పాల్గొన్నారు.

టన్నుకు అదనంగా రూ.10 పీఎఫ్ నిధికి జమ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): టన్నుకు 10 రూపాయల చొప్పున సీఎంపీఎఫ్ నిధికి అదనంగా జమ చేయనున్నట్లు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లకు కోల్ ఇండియా లిమిటెడ్ తెలిపింది. ఈ మేరకు రాతపూర్వకంగా సమాచారం అందించింది. కోల్‌కతాలో జరిగిన సీఎంపీఎఫ్ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు యాజమాన్యం తెలియజేసింది. ప్రస్తుతం టన్నుకు 10 రూ పాయలు ఉండగా, కోల్ ఇండియా నిర్ణయంతో 20 రూపాయలకు పెరుగనుంది. ఇది ఏప్రిల్ 16 నుంచి అమల్లోకి రానుంది.

ఆర్కే-6 గనిపై చండీయాగం

శ్రీరాంపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని ఆర్కే-6 గనిపై బుధవారం చండీయాగం నిర్వహించారు. విశిష్ట అతిథులుగా వాలతి-సూర్యనారాయణ(డైరెక్టర్-ఆపరేషన్స్), కె. విజయలక్ష్మీ-వెంకటేశ్వర్లు (డైరెక్టర్-పీపీ), ముఖ్య అతిథిగా ఏరియా జీఎం ఎం. శ్రీనివాస్-ఉమారాణి దంపతులు హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏజెంట్ శ్రీధర్, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

రక్షణతో కూడిన ఉత్పత్తే లక్ష్యం



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించడమే యాజమాన్యం లక్ష్యమని, సింగరేణి డైరెక్టర్ ప్లానింగ్ ప్రాజెక్టు వెంకటేశ్వర్లు అన్నారు. కొత్తగూడెం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మందమర్రి ఏరియాకు సంబంధించి ఎలక్ట్రికల్, మెకానికల్ డిపార్టుమెంట్లకు సంబంధించి రక్షణ చర్యలపై గురువారం మాట్లాడారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎలక్ట్రికల్, మెకానికల్‌కు సంబంధించి చిన్న చిన్న పొరపాట్లతో ప్రమాదాలు సంభవిస్తాయని, అందుకే గనిలోకి దిగిన వెంటనే అధికారులు ప్యానెల్స్, స్విచ్‌బోర్డులు, ఉత్పత్తి పరికరాలను పరిశీలించుకోవాలని సూచించారు. కార్మికులకు ఏమైనా అనుమానాలుంటే అధికారుల దృష్టికి తీసుకోవాలన్నారు. రక్షణ విషయంలో యాజమాన్యం పకడ్బందీ రక్షణ చర్యలు చేపడుతుందన్నారు. సమావేశంలో కార్పొరేట్ సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్, బెల్లంపల్లి రీజియన్ రక్షణాధికారి రవికుమార్, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ రవీందర్ పాల్గొన్నారు.

మహిళల స్వయం ఉపాధికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తున్నాం

ఐకేపీ ఏపీఎం వెంకటేష్, కాసిపేట



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : మహిళల ఆర్థికాభివృద్ధికి ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

ఐకేపీ ఏపీఎం : మహిళలను ఆర్థికంగా ప్రోత్సహించేందుకు మహిళ శక్తి పథకం ద్వారా పెరటికోళ్ల డైరీ ఫాం మదర్ యూనిట్ ఏర్పాటు చేసి 125 కుటుంబాలకు ఉపాధి కల్పించాము. ఈ ఏడాది పెరటి కోళ్ల పెంపకం యూనిట్లను మరింత విస్తరించి ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చేలా చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో మహిళ సంఘాలు ఎన్ని ఉన్నాయి, వాటికి ఇచ్చిన బ్యాంకు లింకేజీ ఎంత?

ఐకేపీ ఏపీఎం : మండలంలో 759 స్వయం సహాయక సంఘాలున్నాయి. వీటికి రూ. 39.90 కోట్లు రుణాలు అందజేశాం. అలాగే స్త్రీనిధి ద్వారా 12 ఎస్‌హెచ్‌జీలకు రూ. 3.20 కోట్ల రుణాలు ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి : గిరిజన మహిళా సంఘాలకు ఎలాంటి ప్రోత్సాహకాలు ఇస్తున్నారు?

ఐకేపీ ఏపీఎం : ప్రభుత్వం వాటర్ షెడ్ పథకం ద్వారా రూ. 2 కోట్ల గ్రాంట్‌ను మండల సమాఖ్యకు ఇచ్చింది. 9 గిరిజన గ్రామైక్య సంఘాల్లోని 408 మందికి వడ్డీ లేకుండా ఒక్కొక్కరికి రూ. 50 వేల రుణం ఇవ్వడం జరిగింది.

ఆంధ్రజ్యోతి : పేదరికం నిర్మూలనకు చేపట్టిన చర్యలు ఏమిటి?

ఐకేపీ ఏపీఎం : ప్రతి మహిళను స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా చేసి మహిళ సాధికారతలో భాగంగా కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేస్తున్నాం. వారికి గ్రామైక్య సంఘం, మండల సమాఖ్యల నుంచి శిక్షణ ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు రుణాలు అందిస్తున్నాం.

- కాసిపేట, (ఆంధ్రజ్యోతి)

పన్ను వసూళ్లలో ముందంజ

లక్సెట్టిపేట, ఏప్రిల్ 03(ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట మున్సిపాలిటీలో వివిధ రకాల ఆస్తి పన్ను వసూలు చేయడంలో రాష్ట్రంలో 14వ స్థానంలో నిలిచినట్టు మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్ తెలిపారు. ఇప్పటి వరకు 86.55శాతం పన్ను వసూలు చేసినట్లు తెలిపారు. గురువారం హైదరాబాద్‌లో సీడీఎంఏ నిర్వహించిన సమావేశంలో బెస్టు మున్సిపాలిటీగా లక్సెట్టిపేట మున్సిపాలిటీని గుర్తించి అధికారుల చేతు మీదుగా కమిషనర్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేసారన్నారు.

కూరగాయల సాగుతో లాభాలు

నెన్నెల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : కూరగాయలు సాగు చేస్తే లాభాలు పండవస్తాయని మండల వ్యవసాయ అధికారి పుష్పాల సృజన అన్నారు. గురువారం దుబ్బగూడం రైతులు సాగు చేస్తున్న కూరగాయల పంటలను పరిశీలించారు. పందిళ్ల ద్వారా సాగు చేసే బీర, కాకర, సోర, దొండ లాంటి తీగ జాతి కూరగాయల సాగు విధానం, సశ్యరక్షణ చర్యల గూర్చి వివరించారు. ఆమె వెంట ఏఈవో రామ్ చెందర్ ఉన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

బెల్లంపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య గురువారం హైదరాబాద్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశాడు. ఈ నెల 27న వరంగల్‌లో జరుగనున్న బహిరంగ బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ కార్యక్రమాల్లో భాగంగా మాజీ సీఎంను కలిసినట్టు తెలిపారు.

ఘనంగా ప్రతిష్ట మహోత్సవాలు

వేమనపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొమ్మన గ్రామంలో గురువారం భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుడు ముద్దు నరహరి శర్మ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, పుణ్యహవాచనం, అఖండ దీపారాధన, నవగ్రహ వాస్తు యోగాని క్షేత్ర పాలక సర్వతోభద్ర మంటప పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన

దండేపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం వెల్గనూర్‌లో నూతనంగా నిర్మించతలపెట్టిన శ్రీసీతారామ సహిత దాసాంజనేయ ఆలయంలో ఈనెల 4 నుంచి 6వరకు విగ్రహ ప్రతిష్ఠాపన పూజలను వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలిపారు. మూడు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పనుల పరిశీలన

వేమనపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేతనపల్లి, ముల్కలపేట గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను, నర్సరీల పనులను గురువారం ఎంపీడీవో కుమారస్వామి పరిశీలించారు. ఎండకాలం కావడంతో ఉపాధి హామీ పనులు జరిగే ప్రాంతాల వద్ద తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించాలన్నారు. నర్సరీల్లోని మొక్కలను సంరక్షించాలని, రోజు రెండు సార్లు నీరు పట్టాలన్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.



రెక్క, నాగలితో చేను దున్నుతున్న రైతు



గడ్డి కట్టలు కట్టే యంత్రం

ఆధునిక సాగు వైపు అడుగులు

- వ్యవసాయ యాంత్రీకరణకు సర్కారు ప్రోత్సాహం
- జిల్లాకు 292 యూనిట్లు మంజూరు
- మహిళా రైతులకే యంత్రాలు, పరికరాలు
- లబ్ధిదారుల ఎంపికకు గ్రామ కమిటీల ఏర్పాటు

నెన్నెల, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఏడేళ్లుగా నిలిచిపోయిన వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ప్రభుత్వం పునరుద్ధరించింది. రైతులకు సాగుకు అవసరమైన యంత్రాలు, పరికరాలను రాయితీపై అందించేందుకు నిధులు విడుదల చేసింది. సబ్‌మిషన్ ఆఫ్ ఫామ్ మెకనైజేషన్ (ఎస్ఎంఏఎం) పథకం కింద జిల్లాకు 292 యూనిట్లకు గాను రూ. 67.90 లక్షల నిధులు మంజూరయ్యాయి. అయితే ఈ పథకానికి మహిళా రైతులు మాత్రమే అర్హులు. సొంత భూమి కలిగి ఉన్న సన్న, చిన్నకారు మహిళా రైతులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మండల వ్యవసాయ అధికారి అధ్యక్షతన ఉండే గ్రామ కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి కావాల్సిన పరికరాలను 50శాతం సబ్సిడీపై అందజేస్తారు. నిలిచిపోయిన స్కీంను ప్రభుత్వం పునఃప్రారంభించడంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

అందజేసే యంత్రాలు, పరికరాలు ఇవే...

వ్యవసాయ పనుల్లో రైతులు ఉపయోగించే 14 రకాల యంత్రాలు, పరికరాలను సబ్సిడీపై అందివ్వనున్నారు. ట్రాక్టర్లు, డ్రోన్‌లు, పవర్ స్ప్రేయర్లు, బ్యాటరీ స్ప్రేయర్లు, రోటోవేటర్లు, విత్తనాలు, సీడ్ కమ్ ఫర్టిలైజర్ డ్రమ్, పవర్ టిల్లర్, కల్టివేటర్, రోటాపడ్లర్, డిస్క్ హ్యా రో, ఫ్లవ్, బండ్ ఫార్మర్ (బోదెల తయారీ యంత్రం), పవర్ వీడర్, బ్రష్ కట్టర్, వరి గడ్డి కట్టలు కట్టే యంత్రం, మొక్కజొన్న నూర్పిడి యంత్రం తదితర ఆధునిక వ్యవసాయ యంత్రాలు, పనిముట్లను 50శాతం రాయితీపై రైతులకు అందివ్వనున్నారు.

మహిళా రైతులకే..

ఎస్ఎంఏఎం పథకం ద్వారా మహిళా రైతులకే వ్య వసాయ యంత్రాలు, పనిముట్లు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. పట్టాదారు పాసుపుస్తకం మహిళా రైతు పేరిటనే ఉండాలి. ట్రాక్టర్ అనుబంధ యంత్రాల కోసం ట్రాక్టర్ ఆర్‌సీ మహిళా రైతు పేరు మీద లేదా భర్త పేరిట ఉండాలనే నిబంధనలు ఉన్నాయి. అర్హులైన రైతులు మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. గతంలో ఈ పథకాన్ని రాష్ట్రవ్యవసాయ పారిశ్రామిక అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్) ద్వారా అమలు చేసేవారు. దీని ద్వారా పథకం సరిగ్గా అమలు కాలేదని అధికారులు ప్రభుత్వానికి నివేదించడంతో నేరుగా వ్యవసాయశాఖ ద్వారానే పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. వచ్చే వానాకాలం సీజన్‌లోగా రైతులకు యంత్రాలు అందేలా ప్రణాళికలు రూపొందించారు. త్వరలో మహిళా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరణ ప్రారంభించనున్నారు. గ్రామకమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

● పారదర్శకంగా ఎంపిక

అవకతవ కలకు తావు లేకుండా లబ్ధిదారుల ఎంపిక చేసేలా గైడ్ లైన్స్ రూపొందించారు. లక్ష రూపాయలలోపు విలువైన పరికరమైతే మండల వ్యవసాయ అధికారి కన్వీనర్‌గా ఉన్న కమిటీ, రూ. లక్షకుపైన విలువైన యూనిట్ అయితే కలెక్టర్ జిల్లా కమిటీ చైర్మన్‌గా ఉన్న కమిటీల బ్ధిదారులను ఎంపిక చేస్తుంది. ఈసారి లబ్ధిదారుల ఎంపిక పారద ర్శకంగా ఉంటుందని అధికారులంటున్నారు.

రైతన్నకు ప్రయోజనం

ఉపాది హామీ పథకం ప్రారంభం అయ్యాక వ్యవసాయ కూలీల కొరత తీవ్రంగా వేధిస్తోంది. యంత్రాలు, పరికరాలను ఉపయోగించి పలువురు రైతులు కష్టాలను అధిగమిస్తున్నారు. బురద పొలాల్లో దమ్ము చేసే పని వీల్స్ ట్రాక్టర్లు చేస్తున్నాయి. వరినాట్లు యంత్రాలే వేస్తున్నాయి. కంబైన్డ్ హార్వెస్టర్లు కోతలు కోసి నూర్పిడి చేసి తక్కువ సమయంలో వడ్ల రాసులు పోసేస్తున్నాయి. తక్కువ సమయంలో కష్టం లేకుండా ఎక్కువ విస్తీర్ణంలో పురుగు మందులు పిచికారి చేసేందుకు, డ్రోన్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు అందుబాటులోకి వచ్చాయి. కాని అందరు రైతులకు ఆధునిక యంత్రాలు, పరికరాలు అందుబాటులో లేక పోవడం ప్రతిబంధకంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో కిరాయికి లభిస్తున్నప్పటికీ ఏకకాలంలో అందరికి అవస రం పడుతుండటంతో అదనుతప్పి పనులు వెనుకబడు తున్నాయి. రైతులకు అవసరమైన యంత్రాలు, పరికరా లను ప్రభుత్వం సబ్సిడీపై అందజేసే పథకాన్ని ప్రారభి స్తుండటంతో తమకు ప్ర యోజనం చేకూరుతుందని రైతులు అంటున్నారు.

వ్యవసాయ యాంత్రీకరణతో రైతులకు లబ్ధి



ప్రస్తుత కాలంలో వ్యవసాయ యాంత్రీకరణ ఎంతో అవసరం. రైతుల అవసరాన్ని గుర్తించిన ప్రభుత్వం సబ్‌మిషన్ ఆఫ్ ఫామ్ మెకనైజేషన్ (ఎస్ఎంఏఎం) పథకం అమలు చేస్తోంది. వ్యవసాయ యంత్రీకరణతోచి న్నకారు, సన్నకారు రైతులకు లబ్ధి చేకూరుతుంది. అవసరమైన యంత్రాలు, పరికరాల కోసం మహిళా రైతులు మీసేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. గ్రామ కమిటీల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి సబ్సిడీపై యంత్రాలు, పరికరాలు అందజేస్తాం.

- కల్పన, జిల్లా వ్యవసాయ అధికారి

గోదావరి తీరం నుంచి జోరుగా ఇసుక రవాణా



ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

దండేపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గోదావరి తీరం నుంచి ఇసుకాసురులు యథేచ్ఛగా ఇసుక రవాణా చేస్తున్నారు. నిత్యం సుమారు 15 ట్రాక్టర్లకు పైగా అనుమతుల్లేకుండా ఇసుక తరలిస్తున్నారు. మండలంలోని కాసిపేట గోదావరి నది నుంచి ఇసుక వ్యాపారం జోరుగా సాగుతుంది. దీంతో గోదావరి తీర ప్రాంతాలలో ఉన్న వ్యవసాయ భూములు బోర్లల్లో భూగర్భ జలాలు అడుగుతున్నాయి. గురువారం ఉదయం గోదావరి నదిలో ట్రాక్టర్లులో ఇసుక నింపుకుని తరలించేందుకు సిద్ధంగా ఉండగా అక్కడికి చేరుకున్న మీడియాను చూసిన ఇసుకాసురులు ట్రాలీలను అక్కడే వదిలి పరారయ్యారు. విషయాన్ని దండేపల్లి తహసీల్దార్ సంధ్యారాణి, ఎస్సై తహసీనోద్దీన్‌కు సమాచారం ఇవ్వగా సిబ్బందితో గోదావరినదికి చేరుకున్నారు.

అప్పటికే ధర్మపురి వైపు 15ట్రాక్టర్లను తరలించారు. మిగిలిన ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ సిబ్బంది పట్టుకుని సీజ్ చేశారు. వారం క్రితం పోలీసులు గోదావరి నదిలోకి వెళ్లి ఇసుక ట్రాక్టర్లను పట్టుకోని దండేపల్లి పోలీసుస్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. అధికారులు దాడులు చేసినా ఇసుక దందా మాత్రం ఆగడం లేదు.

బందెల దొడ్డి స్థలం స్వాధీనం

తాండూర్, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులోని సర్వే నెంబరు 79లో ఉన్న బందెల దొడ్డి భూమిని గురువారం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తపల్లి గ్రామ శివారులోని 79 సర్వే నెంబరులో 1.0150లో పూర్వ నుంచి ప్రభుత్వ బందెల దొడ్డికి వినియోగిస్తున్నారు. 4 ఏళ్ల నుంచి ఈ స్థలం తనదని పెరుగు గంగయ్య పేర్కొంటున్నాడు. దీంతో గురువారం గిర్దావర్ మోకాపైకి వెళ్లి కొలతలు వేయించి, రికార్డులను పరిశీలించి ఈ స్థలం ప్రభుత్వ బందెల దొడ్డిదని నిర్ధారణకు వచ్చారు. ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని తదుపరి చర్యలకు తహసీల్దార్‌కు నివేదికలు సమర్పించున్నట్లు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

లక్సెట్టిపేట, ఏప్రిల్ 3(ఆంధ్ర జ్యోతి): లక్సెట్టిపేట పట్టణంలోని ఊ త్కూర్ చౌరస్తాలో ప్రవీన్ ఇంటీరియల్స్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అభిమాని నల్లపు ప్రవీణ్ ఏర్పాటు చేసిన చలి వేంద్రంను కాంగ్రెస్ పార్టీ డీసీసీ ఉపాధ్యక్షుడు చెల్ల నాగభూషణం గురువారం ప్రారంభించారు. మాజీ కౌన్సిలర్ వెంకటేష్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

భీమారం, ఏప్రిల్ 3 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని పలు ఎరువుల దుకాణాలను గురువారం మండల వ్యవసాయాధికారి అత్తె సుధాకర్ తనిఖీ చేశారు. స్టాకు రిజిష్టర్‌లను, ఎరువులు, విత్తనాల నిల్వలను పరిశీలించారు. ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులు కొన్న వాటికి బిల్లులు అందజేయాలన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్‌వెంకటస్వామి

కాసిపేట, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 53 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. రేషన్ షాపుల ద్వారా ప్రజలకు ఉగాది నుంచి సన్నబియ్యం పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు. నిరుపేద యువతుల వివాహాల కోసం కల్యాణలక్ష్మీ, షాదిముబారక్ ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తుందన్నారు. అంతకుముందు దేవాపూర్‌లో వాటర్ షెడ్ యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ నీటి నిల్వలను పెంచేందుకు అందరు కృషి చేయాలన్నారు. మొక్కలను పెంచి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి నీటి ఆవశ్యకతను వివరంచారు.

ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయ ణసింగ్, ఎంపీవో సప్దర్ ఆలీ, దేవాపూర్ పంచాయతీ కార్యదర్శి కవిత, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్టు



నెన్నెల పోలీస్ స్టేషన్‌లో బీజేపీ నాయకులు

బెల్లంపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో హెచ్‌సీయు భూములను అభివృద్ధి పేరుతో రాష్ట్ర ప్రభుత్వం అమ్మకాలు చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ యూనివర్సిటీ విద్యార్థులు చేస్తున్న పోరాటానికి మద్దతు తెలిపేందుకు వెళ్తున్న బీజేవైఎం నాయకులను గురువారం వన్‌టౌన్ పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో అరవింద్, నవీన్ ఉన్నారు.

నెన్నెల : మండల బీజేపీ నాయకులను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. బీజేపీ మండల అధ్యక్షులు అంగలి శేఖర్, మాజీ మండల అధ్యక్షుడు శైలేందర్ సింగ్ అరెస్టు అయిన వారిలో ఉన్నారు.

తాండూర్ : తాండూర్‌లో అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం మండల అధ్యక్షుడు మామిడి విగ్నేష్ మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు. అరెస్టు అయిన వారిలో విగ్నేష్, శంకర్‌లు ఉన్నారు.

భీమారం : మండలంలో అరెస్టు అయిన వారిలో బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొమ్ము కుమార్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి వేల్పుల రాజేశం యాదవ్ ఉన్నారు.

లక్సెట్టిపేట : పట్టణంలోని పలు విద్యార్థి సంఘాల నాయకులను లక్సెట్టిపేట పోలీసులు గురువారం ముందస్తు అరెస్టులు చేసారు. గిరిజన విద్యార్థి సంఘం నాయకులు ఈశ్వర్ మాట్లాడుతూ విద్యార్థుల పై ప్రభుత్వం చేపిస్తున్న లాఠీ చార్జీని, అక్రమ అరెస్టులను తీవ్రంగా ఖండించారు. భూములను కాపాడుకుంటామని డిమాండ్ చేసారు.

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కరువు..

(5వ పేజీ తరువాయి)

భత్యాన్ని చెల్లించే విధానం ఉండేది. కూలీలకు ప్రయాణ, కరువు భత్యం (టీఏ, డీఏ), ఖర్చు కింద గడ్డపారికు రూ. 10, తట్టకు రూ. 5, మం చినీటికి రూ. 5 చెల్లిస్తుండేవారు. అలాగే అయిదు కిలోమీటర్లకు పైగా దూరం నుంచి వచ్చే వారికి ప్రత్యేకంగా రూ. 20 చొప్పుల చెల్లించాల్సి ఉంది. భత్యం తోపాటు పని ప్రదేశంలో విశ్రాంతి తీసుకునేందుకు టెంట్ సౌకర్యం కల్పించాలి. మార్చి ఒకటవ తేదీ నుంచి వేసవిగా పరిగణించి పై భత్యాలు చెల్లించడంతోపాటు పై ఖర్చులు అమలు చేయాల్సి ఉండగా, కేంద్ర ప్రభుత్వం కొన్ని మార్పులు చేయగా, భ త్యాల చెల్లింపునకు అందులో చోటు కల్పించలేదు. దీంతో కూలీలలకు భత్యాలు అందకపోగా మెడికల్ కిట్లు, నెట్లు కూడా సమకూర్చడం లేదు.

లక్ష్యం మేరకు పనులు కల్పిస్తున్నాం

డీఆర్డీవో కిషన్

ఉపాధి హామీ పథకంలో భాగంగా లక్ష్యం మేరకు పనులు కల్పించేందుకు కృషి చేస్తున్నాం. జాబ్ కార్డు కలిగిన కూలీలకు నిర్దేశిత లక్ష్యం ప్రకారం ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నాం. మంచినీటి సౌకర్యం కూలీలే తెచ్చు కుంటుండగా, గ్రామ పంచాయతీలు కూడా సమకూరుస్తున్నాయి. ప్రస్తుతం ఎండల కారణంగా కూలీలు తెల్లవారుజామునే పని స్థలాలకు వెళ్లి కూలీ గిట్టుబాటయ్యే వరకు పనులు చేస్తుండటంతో లక్ష్యాన్ని అధిగమించాము.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

కన్నెపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తాండూర్ సీఐ కుమార స్వామి పేర్కొన్నారు. గురువారం కన్నెపల్లి మండలంలోని సుర్జాపూర్ గ్రామంలో నకిలీ విత్తనాలపై పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. రైతులకు అవగాహన కల్పించారు. నకిలీ విత్తనాలు వాడడం వల్ల భూమి సారం తగ్గి పోయి పంట దిగుబడి కూడా తగ్గుతుందన్నారు. రైతులందరు లైసెన్స్ ఉన్న ఫెర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, కొన్న వాటికి రశీదులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కన్నెపల్లి ఎస్ఐ గంగారాం, మండల వ్యవసాయాధికారి సాయి, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

కోటపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్ హెచ్చరించారు. గురువారం కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో కోటపల్లి, నీల్వాయి, పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్ల సమాజంలో గౌరవంగా బతకాలని, అసాంఘీక కార్యకలాపాలకు, గొడవలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కోటపల్లి, నీల్వాయి ఎస్ఐలు రాజేందర్, శ్యామ్‌పటేల్ పాల్గొన్నారు.

మిత్రుడి కూతురు పెళ్లికి ఆర్థిక సాయం

దండేపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2001-02లో పదోవ తరగతి వరకు చదువుకున్న బాపులాల్ కూతురు వివాహానికి ఆయనతో చదువుకున్న బాల్య మిత్రులందరు పెళ్లి ఖర్చుల కోసం రూ. 50వేల ఆర్థిక సాయం అందజేశారు. నిరుపేద కుటుంబం కావడంతో తమతో చదువుకున్న మిత్రుడి కూతురు వివాహానికి తమకు తోచిన విధంగా సహాయం అందించేలానే సంకల్పంతో బాపులాల్ కోమురం భీం ఆసిఫాబాద్ జిల్లా లింగాపూర్ మండలం దాంపూర్‌కు ఇంటికి వెళ్లి పెళ్లిపందిరిలో మిత్రులు 50వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో 2001-02 టెన్త్ బ్యాచ్ మిత్రులు పాల్గొన్నారు.

మందమర్రి మున్సిపాలిటీకి ప్రశంసా పత్రం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : 2024-25 ఆర్థిక సంవత్సరానికి మందమర్రి మున్సిపాలిటీకి పన్నుల వసూళ్లలో జిల్లాలో రెండవ స్థానం సాధించినందుకు గురువారం హైద్రాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ డైరెక్టర్ పురపాలక పరిపాలన విభాగం అధికారి శ్రీదేవి చేతుల మీదుగా మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజలింగు ప్రశంసా పత్రం అందుకున్నారు. మున్సిపాలిటీకి రూ. 2.29 కోట్ల పన్నుల లక్ష్యం ఉండగా రూ. 1.76 కోట్లు వసూలు కావడంతో ప్రశంసా పత్రం దక్కింది.

భూ కబ్జాదారులపై పీడీ యాక్టు నమోదు చేయాలి

బెల్లంపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్న వారిపై పీడీ యాక్టు కేసు నమోదు చేసి జైలుకు పంపించాలని కోరుతూ గురువారం కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే వినోద్‌లకు ఎంసీపీఐయు నాయకులు వినతి పత్రం అందజేశారు. కొందరు నకిలీ పత్రాలను సృష్టించి ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారని, కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బెల్లంపల్లిలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్న సంబంధిత రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని కలెక్టర్, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. నాయకులు సబ్బని రాజేంద్రప్రసాద్, పసులేటి వెంకటేష్, రమేశ్, రాజశేఖర్, వంశీ పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని వినతి

తాండూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తాండూర్ మండలంలో ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం టీడీపీ మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ మండల డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. తాండూర్‌లో ఆధార్ కేంద్రం లేక ప్రజలు, విద్యార్థు లు, కార్మికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో 15 గ్రామ పంచాయతీలుండగా ఒక్క ఆధార్ కేంద్రం కూడా లేదన్నారు. వెంటనే ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు.

శివాజీ ఆశయ సాధనకు కృషి చేయాలి

దండేపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): శివాజీ ఆశయప్రతి ఒకరు కృషి చేయాలని బిజేపి పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు రఘు నాథ్ వెరబెల్లి కోరారు. దండేపల్లి మండలంలో బిజేపి మండల శాఖ, చత్రపతి శివాజీ ఉత్సహ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ చౌరస్తా వద్ద ఉన్న చత్రపతి శివాజీ విగ్రహానికి బీజేపీ నాయకులతో కలిసి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళ్లులర్పించారు. కార్యక్రమంలో బీజేజీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య, మండల ఇన్‌చార్జి గుండ ప్రభాకర్, ఉత్సవ కమిటి సభ్యులు రవిగౌడ్, దిలీప్ కుమార్, గంగాధరి వెంకటేష్, గడికో ప్పుల సురేందర్ పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: బీజేపీ ఆధ్వర్యంలో లక్సెట్టిపేటలో చత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక కరీంనగర్ చౌరస్తాలో గల ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు రఘునాత్ వెరబెల్లి, నాయకులు హరిగోపాల్‌రావు, హేమంత్‌రెడ్డి, గుండ ప్రభాకర్, గోపతి రాజయ్య, సురేందర్ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

నస్పూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్‌లో బీఆర్ అంబేద్కర్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం మాజీ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు ప్రారంభించారు. వేదిక వద్ద అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసారు. పోటీలకు హాజరైనా క్రీడాకారులను పరిచయం అనంతరం పోటీలను ప్రారంభించారు. పోటీలకు దాదాపు 50 క్రికెట్ జట్లు హాజరైయ్యాయి. అంబేద్కర్ జయంతి రోజు 14వ తేదిన ఫైనల్ మ్యాచ్ జరుగుతుం దన్నారు. ఇదే రోజున విజేతలకు బహుమతుల పంపిణీ కార్యక్రమం ఉంటుందని మాజీ చైర్మన్ వేణు కోరారు. 10వార్డు మాజీ కౌన్సిలర్ సుమతి మల్లేష్, యూత్ కాంగ్రెస్ నాయ కులు సంపత్‌రెడ్డి, మాజీ సర్పంచు గోపాల్ రావు, మున్సి పల్ బిల్ కలెక్టర్ సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ సాయుధ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య అని జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ పేర్కొన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య జయంతి వేడుకల్లో పాల్గొని కొమురయ్య చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెనకబిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం నాయక్ పాల్గొన్నారు.



ఉపాధి కూలీలకు సౌకర్యాలు కరువు..

- పని స్థలాల్లో కానరాని ఏర్పాట్లు
- లక్ష్యం నెరవేరినా కూలీలకు తప్పని ఇబ్బందులు
- తాగునీరు లేక ఎండలకు విలవిల్లాడుతున్నవైనం



చెన్నూరు మండలం ఒత్కులపల్లిలో పని స్థలం వద్ద ఎండ లోనే ఉన్న ఉపాధి కూలీలు

మంచిర్యాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అరకొర సౌకర్యాల నడుమ ఉపాధి హామీ పథకం పనులు చేయాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు గత నెల 31వ తేదీ వరకు ముగియగా, ఈ నెల 1 నుంచి కొత్త సీజన్ పనులు చేపడుతున్నారు. వేసవి కాలంలో చేపట్టే ఉపాధి హామీ పనులకు సంబందించి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. అడవులు, చెరువులు, కాలువల్లో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు ఎండలకు విలవిల్లాడుతున్నారు. కూలీలు సేద తీరేందుకు కనీసం నీడ ఏర్పాట్లు కూడా చేయలేదు. పనుల వద్ద కనీసం తాగునీటి సౌకర్యం లేదంటే అతశయోక్తికాదు.

భత్యాలు అందక ఇబ్బందులు...

ఉపాధి హామీ పథకం కింద చెల్లించే వేతనాలను కేంద్ర ప్రభుత్వం సవరించడంతో కూలీలకు కొంతమేర ఊరట లభిస్తుందనే చెప్పవచ్చు. వేతనాలు కనీసం 4 నుంచి 10 శాతం మేర పెరిగాయి. సవరించిన లెక్కల ప్రకారం...నైపుణ్యం లేని (అన్ స్కిల్డ్) కార్మికులకు ఈ పథకం కింద చెల్లించే రోజువారీ వేతనం రాష్ట్రంలో రూ. 307 చెల్లిస్తున్నారు. ఇదిలా ఉండగా కేంద్ర ప్రభుత్వం వేసవి భత్యం నిలిపి వేయడంతో కూలీల్లో ఆందోళన నెలకొంది. మండు టెండల్లో పనిచేసే వారికి గతంలో ఉన్న కొన్ని సౌకర్యాలను తొలగించడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోంది. ఉపాధి హామీ పనులు వేసవిలోనే పూర్తిస్థాయిలో జరుగుతుంటాయి. అధిక ఉష్ణోగ్రతలతో కూలీలు ఇబ్బందులు పడుతుంటారు. ఎండ నుంచి వారిని రక్షించేందుకు మంచినీటి సరఫరా, షేడ్ నెట్లు సమకూర్చుకునేందుకు గాను కొంత మొత్తం చెల్లించేవారు. అలాగే వేసవిలో పనులు చేసినందుకు గాను 30 శాతం అదనపు..

మిగతా 7లో

లక్ష్యాన్ని అధిగమించి...

2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలో లక్షా 20వేల 854 కుటుంబాలకు జాబ్ కార్డులు ఉండగా, 2,36,818 మంది ఉపాధి కూలీలు ఉన్నారు. వీరికి డైలీ వేజెస్ కింద సవరించిన వేతనం ప్రకారం రూ. 300 చొప్పున చెల్లిస్తున్నారు. కూలీలకు పనులు కల్పించేందుకు గాను 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 30 లక్షల పని దినాలు లక్ష్యం గా పెట్టుకోగా, ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగడంతో గడువు ముగిసే సరికి 31 లక్షల పనిదినాలు పూర్తిచేసి, 103.51 శాతం నమోదు చేశారు. జిల్లాలో కేవలం 82,004 కుటుంబాల్లోని 1,29,676 మంది కూ లీలకు మాత్రమే పనులు కల్పించారు. వీరిలో కేవ లం 3884 కుటుంబాలకు మాత్రమే 100 రోజుల పనిదినాలను కల్పించారు. కాగా ఉపాధి పనులకు రో జువారీ వేతనం రూ. 300 చెల్లిస్తున్నప్పటికీ, గతంలో కంటే ఉపాధి పనుల వైపే కూలీలు మొగ్గు చూపుతున్నారు.

గద్దర్ పేరిట అవార్డు అభినందనీయం

మందమర్రిటౌన్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజాయుద్ద నౌక గద్దర్‌తో పాటు ఇతర ఉద్యమకారుల పేరుతో సినిమా కళాకారులకు అవార్డులు అందజేయడం అభినందించదగ్గ విషయమని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెం కటస్వామి తెలిపారు. హైద్రాబాద్‌లోని ఫిల్మ్‌చాంబర్‌లో రాష్ట్ర ప్రభుత్వం గద్దర్, పైడి జైరాజ్, కత్తి కాంతారావుల మీద అవార్డులు ప్రకటించిన సందర్భంగా పంజాల జైహింద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కృతజ్ఞత సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఫిల్మ్‌చాంబర్ సభ్యులు పాల్గొన్నారు.

అట్టహాసంగా గ్రాడ్యుయేషన్ డే



నృత్యం చేస్తున్న చిన్నారులు

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం లక్ష్మీనగర్ శ్రీచైతన్య పాఠశాలలో అట్టహాసంగా గ్రాడ్యూయేషన్ డేను నిర్వహించారు. చిన్నారులు నృత్యాలతో అలరించారు. యూకేజీ పూర్తి చేసుకొని 1వ తరగతికి చేరుకున్న విద్యార్థులకు, ఐదవతరగతి పూర్తిచేసుకొని ఆరోతరగతిలో అడుగు పెట్టిన విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ ఇచ్చి అభినందించారు. పాఠశాల చైర్మన్, డైరెక్టర్లు మల్లంపాటి శ్రీధర్, శ్రీవిద్య, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అరవిందరెడ్డి, ప్రిన్సిపాల్ అయ్యూబ్, కోఆర్డినేటర్ జయశ్రీ, రోజారాణి, క్రిష్ణవేణి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



వాటర్ షెడ్ యాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

జైపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ పేర్కొన్నారు. గురు వారం మండలంలోని మిట్టపల్లి గ్రామంలో వాటర్ షెడ్ యాత్రను ప్రారంభిం చారు. నీటి సంరక్షణ ప్రాధాన్యతపై గ్రామంలో విద్యార్థులు, అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యత నీటి సంరక్షణ మాత్రమే కాకుండా పర్యావరణ పరిరక్షణ కూడా ఎంతో కీలకమని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ద్వారా వాతావరణ సమతుల్యత సాధించవచ్చన్నారు. పరిశుభ్రత, ఆరోగ్యం, పాఠశాల పరిసరాలను హరితమయంగా మార్చడం ద్వారా విద్యార్థులకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ సీఈవో గణపతి, మండల తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో శ్రీపతి బాపురావు, ఏపీఎం రాజ్‌కుమార్, ఏపీవో బాలయ్య, మహిళ సంఘాల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లాట్లను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం గర్మిళ్ల శివారులో తాము కొనుగోలు చేసిన ప్లాట్లను కొందరు కబ్జాకు గురి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని వెంచర్ వద్ద బాధితులు ప్లకార్డు లతో నిరసన తెలిపారు. అనంతరం మంచిర్యాల పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 2004లో వెంచర్‌లో చట్టబద్దంగా కొనుగోలు చేశామని ఆ భూమిని చదును చేసి ముదాం శ్రీనివాస్ అనే వ్యక్తి ప్లాట్లను కబ్జా చేసి వారిని ఇబ్బందులకు గురి చే స్తున్నారని సంబంధిత రెవెన్యూ అధికారులతో పాటు పోలీసులు వారిపై చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో గాండ్ల శ్రీకాంత్, శేఖర్, రాజలింగు ఉన్నారు.

నాయకత్వ లక్షణాన్ని పెంపొందించుకోవాలి

- జిల్లా విద్యాధికారి యాదయ్య



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

మంచిర్యాల క్రైం, ఏప్రిల్3(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకొని విద్యార్థులకు విజ్ఞానాన్ని పెంపొందించే విధంగా కృషి చేయాలని డీఈవో యాదయ్య అన్నారు. మంచిర్యాల పట్టణంలోని గర్మిళ్ల పాఠశాలలో నిర్వహిస్తున్న శిక్షణా తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమోషన్ పొందిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, ప్రాథమిక పాఠశాలల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులకు శిక్షణాతరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా సమగ్ర శిక్షణ కో-ఆర్డినేటర్ చౌదరి, సత్యనారాయణ మూర్తి, ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ పాల్గొన్నారు.

ఉచిత నేత్ర చికిత్స శిబిరం

మంచిర్యాల క్రైం, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం భగ వద్గీత అధ్యయన మండలి వద్ద గురువారం లయన్స్‌క్లబ్ మంచిర్యాల, లయన్స్ క్లబ్ గోల్డెన్ జూబ్లీ సంయుక్తంగా ఉచిత నేత్ర చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. సుమారు 180మందికి పరీక్షలు నిర్వహించగా 75మందికి శస్త్ర చికిత్స అవసరమవుతుందని తెలిపారు. వారిని రేకుర్తి ఐ ఆసుపత్రికి పంపిస్తామని ఆసుపత్రి ప్రతినిధి ప్రభాకర్ తెలిపారు. వీరికి ఉచిత బస్సు సౌకర్యంతో పాటు భోజన వసతి సౌకర్యం కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ మంచిర్యాల అధ్యక్షులు బాలమోహన్, గోల్డెన్ జూబ్లీ అధ్యక్షులు లయ న్ డాక్టర్ రాకేశ్ రెడ్డి, ప్రోగ్రాం చైర్ పర్సన్ లయన్ పి. మధుసూదన్ రెడ్డి, పాల్గొన్నారు.

డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలి



సమ్మెకు మద్దతు తెలుపుతున్న బీజేపీ నాయకులు

జైపూర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంపూర్ ఏరియాలోని ఐకే ఓసీ పీ పరిధిలో సమ్మె చేస్తున్న వోల్వా డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. వోల్వా డ్రైవర్లు వారంరోజులుగా శాంతియుత సమ్మె చేస్తున్నారు. సమ్మెకు గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వారంరోజుల నుంచి ఓసీపీ ఆవరణలో టెంటువేసికుని హక్కులకోసం న్యాయబద్దంగా నిరసన తెలుపుతున్నా సింగరేణి యాజమాన్యం పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. కార్మికులను చర్చలకు పిలువక పోగా యాజమాన్యం, సింగరేణి అధికారులు ప్రైవేటు వ్యక్తులను ఉద్యోగాల్లో నియమించుకుని పనులు చేయించే యత్నం చేస్తున్నారన్నారు. ఈ ప్రయత్నాలను విరమించకపోతే బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ నాయకులు రాజ్‌కుమార్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించాలి

- కలెక్టర్ కుమార్ దీపక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన దర ఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురు వారం నస్పూర్‌లోని కలెక్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా, మండల, గ్రామ స్థాయిల్లో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంతో పాటు రాష్ట్రస్థాయిలో జిల్లాకు సంబం ధించి వస్తున్న దరఖాస్తులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం మండల, డివిజన్ స్థాయి లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో అందుతున్న దరఖాస్తుల్లో పొందుపర్చిన విషయాన్ని పరిశీలించి రెవెన్యూ రికార్డులతో సరి చూసి క్షేత్రస్థాయిలో సందర్శించి త్వరగా పరిష్కరిం చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

●జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా సమర్థవంతమైన కార్యక లాపాలు నిర్వహించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని కలె క్టరేట్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ మోతిలాల్‌తో కలిసి సహకార సంఘం ప్రతినిధులు, అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను పునర్వవస్థీకరించామని, నూతనంగా ఏర్పడిన సంఘాల సమన్వయంతో సమ ర్థవంతమైన కార్యకలాపాలు నిర్వహించాలని తెలిపారు.

సన్న బియ్యం పంపిణీ ఘనత రేవంత్‌రెడ్డిదే..

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్నిప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వినోద్, కలెక్టర్ కుమార్ దీపక్

బెల్లంపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): దేశంలో మొట్టమొదట సారిగా సన్న బియ్యం పథకాన్ని రాష్ట్రంలో ప్రారంభించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిదే అని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు రేషన్ దుకాణాల్లో సన్న బియ్యం పథకాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ఏరాష్ట్రంలో ఏ ప్రభుత్వం అమలు చేయని విధంగా తెలంగాణ రాష్ట్రంలో పేద కుటుంబాలకు సన్న బియ్యం అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభు త్వం మెనిఫెస్టోలో లేని పథకాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారని తెలి పారు. గత ప్రభుత్వాలు పేదల అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరిక్రిష్ణ, నాయకులు కారుకూరి రాంచందర్, బత్తుల రవి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్వేత, మాజీ కౌన్సిలర్ రాజలింగు పాల్గొన్నారు.

చెన్నూరు : చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి సూచనల మేరకు మండలంలోని అక్కెపల్లి, చింతలపల్లి గ్రామాల్లో సన్నబి య్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ మూల రాజిరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ చల్ల రాంరెడ్డి, కాంగ్రెస్ నాయకులు మోహన్‌రెడ్డి, సుశీల్‌కు మార్, శ్రీనివాస్, భద్రచారి, రమే ష్ పాల్గొన్నారు.

తాండూర్ : మండలంలోని అచ్చలాపూర్ గ్రామంలో సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని గురువారం మండల తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, సీఐ కుమారస్వామిలు ప్రారంభించారు. పంచా యతీ కార్యదర్శి కల్పన, కాంగ్రెస్ నాయకులు పోశం, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : మండలంలోని చిర్రకుంట గ్రామంలో గురువారం రేషన్ షాపులో తహసీల్దార్ సతీష్‌కుమార్, ఎంపీడీవో రాజేశ్వర్‌లు సన్నబియ్యం పంపిణీని ప్రారంభించారు. అందుగుల పేట గ్రామంలో కాంగ్రెస్ నాయకులు కడారి జీవన్‌కు మార్ సన్న బియ్యం పంపిణీని ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు గందె రాంచందర్, మాజీ సర్పంచు ఒడ్నాల కొమురయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

నెన్నెల: మండలంలోని ఆవడం, చిత్తాపూర్, నెన్నెల గ్రామాల్లో ఉచిత సన్నబియ్యం పంపిణీ పథకాన్ని గురువారం అధికారులు, నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసిల్దార్ ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గట్టు మల్లేష్, నాయకులు పాల్గొన్నారు.

తీరని కష్టం.. అనుమతుల్లో జాప్యం

- నిలిచిన రోడ్ల నిర్మాణాలు
- నిధులు మంజూరైనా నిరుపయోగం
- అన్నింటికీ అటవీశాఖ అభ్యంతరమే కారణం

6

ఆధునిక సాగువైపు అడుగులు

- వ్యవసాయ యాంత్రీకరణకు సర్కారు ప్రోత్సాహం
- జిల్లాకు 292 యూనిట్లు మంజూరు
- మహిళా రైతులకే యంత్రాలు, పరికరాలు
- లబ్ధిదారుల ఎంపికకు గ్రామ కమిటీల ఏర్పాటు



7

జిల్లాలో వర్షం..



జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

మంచిర్యాల, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మధ్యాహ్నం సమయంలో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం సుమారు అరగంట పాటు కురిసింది. వర్షం కార ణంగా విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాతావరణ చల్లబడింది.

నస్పూర్: నస్పూర్‌లో సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. దీంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది. నిన్నటి వరకు ఉక్కపోతతో ఉన్న ప్రజలు అకాల వర్షంతో కాస్త ఉపశమనం పొందారు.

జైపూర్: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గురువారం 34.8 ఎంఎం వర్ష పాతం నమోదైనట్లు వ్యవసాయాధి కారి మార్క్‌గ్లాడ్‌స్టన్ పేర్కొన్నారు. ఎలాంటి పంట నష్టం జరగలేన్నారు.

కాంగ్రెస్ నాయకుల అవగాహన ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

లక్సెట్టిపేట, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ పిలుపు మేరకు లక్సెట్టిపేట మున్సిపాలిటీలోని 14, 15వార్డుల్లో కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక నాయకులు జైబాపు, జైభీం, జైసంవిధాన్ అవగాహన ర్యాలీ రెండవ రోజు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ జనరల్ సెక్రటరీ చిట్ల సత్యనారాయణ హాజరై మాట్లాడుతూ కొద్ది రోజులుగా బీజేపీ పరిణా మాలు రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తూ ప్రజాస్వామ్య విలువలను కాలరాస్తూ సమాజంలో అశాంతిని నెలకోల్పుతున్నాయన్నారు. ఈలాంటి తరుణంలో శాంతి బద్రతలను కాపాడటం కోసం రాజ్యాంగ విలువలు ప్రజలకు తెలియచెప్పడం కోసం కాంగ్రెస్ పార్టీ ఈకార్య క్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈకార్యక్రమం లో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ.ఆరీఫ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింత అశోక్, మాజీ మున్సి పల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం, మాజీ ఎం పీటీసీ మడిపల్లి స్వామి, యూత్ అధ్యక్షుడు రాందేని చిన్న వెంకటేష్, మాజీ కౌన్సిలర్‌ల, వార్డు అధ్యక్షుడు ఉత్తూరి రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ : అందరూ సంఘటితంగా రాజ్యాంగాన్ని పరి రక్షించుకోవాలని నస్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ సుర్మిళ్ల వేణు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ నస్పూర్ ఇన్‌చార్జి నూకల రమేష్, మండల కోఆర్డినేటర్ అంకతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్‌లోని 6వ వార్డు, 17వ వార్డులో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా వేణు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కౌన్సిలర్లు, వార్డు అధ్యక్షులు, యువజన విభాగం, మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.